సాక్షి
జనగామ

బుధవారం । 24 । జనవరి । 2024



భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు -10లో▸

మేడారం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంక్షేశాఖ సెక్రటరీ డాక్టర్ శరత్ అన్నారు.



కిక్ బాక్సింగ్‌లో పతకాల పంట

రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. -10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/19°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి. కాస్త మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని ఆరుద్రోత్సవం అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి 108 లీటర్ల ఆవు పాలతో ఏకదశ రుద్రాభిషేకం, గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజనములు, మంత్రపుష్పములు వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామదాసు భజన మండలి భజన బృందాలు అలరించాయి. ఈ ఆరుద్రోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కనులారా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.21లక్షలు



చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగడిలో పశువుల క్రయ, విక్రయాలు, కొబ్బరి కాయలు, పూజా సామగ్రికి వేలం పాటలు నిర్వహించగా రూ. 21 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో 2024–25 సంవత్సరానికి గాను దేవాదాయ శాఖ నల్లగొండ జిల్లా పరిశీలకులు సుమతి, ఈఓ లక్ష్మీప్రసన్నలు బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరి కాయలు, పూజాసామగ్రి, గండ దీపం నూనెకు పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన జిట్టబోయిన కుమార్ రూ.14.01 లక్షలకు దక్కించుకున్నారు. అంగడిలో పశువుల క్రయ, విక్రయాలు, దుకాణాల పన్ను వసూలుకు రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన ఇల్లందుల శ్రీను రూ. 7.05 లక్షలకు వేలం ద్వారా దక్కించుకున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలు దేవాలయాలతో సమానం



జనగామ: గ్రంథాలయాలతో మేధోసంపత్తి లభిస్తుందని, అందుకే గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి పదవీ వీడ్కోలు సమావేశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరుగగా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన గ్రంథాలయాలను ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులను కృష్ణారెడ్డి సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండ పద్మయాదగిరిరెడ్డి, అడ్వకేట్ కర్త ఎల్లారెడ్డి, వజ్జులు, జరసం కన్వీనర్ సోమేశ్వరచారి, లైబ్రేరియన్ రాంచందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



జనగామ: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌లు, డైరీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన మూడు డీఆర్‌లను అందించాలని, ఐఆర్ పెంచడంతో పాటు పలు సమస్యలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంకరయ్య, ఉపాధ్యక్షుడు ధర్మయ్య, కార్యదర్శి అంజయ్య, ఇప్పరాంరెడ్డి పలువురు పాల్గొన్నారు.


యూపీహెచ్‌సీని పరిశీలించిన విద్యార్థులు

నయింనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంట యూపీహెచ్‌సీని మంగళవారం ఆస్ట్రేలియా క్యాథలిక్ యూనివర్సిటీ హెల్త్‌కేర్ నర్సింగ్ విద్యార్థులు సందర్శించారు. మదర్ చైల్డ్ హెల్త్, వివిధ ఆరోగ్య పథకాల అమలు తీరు, పనిచేసే విధానం పరిశీలించారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!



నెహ్రూపార్కు అరవై ఫీట్ల రోడ్డు ఏరియాలో పేరుకుపోయిన పారిశుద్ధ్యం



రైల్వే చిన్నమోరి వద్ద..

కంపుకొడుతున్న 'జనగామ'

- డ్రెయినేజీల్లో నిండిన సిల్ట్
- ఎక్కడి చెత్త అక్కడే...
- వేధిస్తున్న దోమల బెడద
- రోగాల బారిన ప్రజలు
- అధికారుల నిర్లక్ష్యం..పర్యవేక్షణ కరువు

పట్టణ వివరాలు..	
మొత్తం వార్డులు:	30
జనాభా:	80వేలు
రోజువారీగా చెత్త సేకరణ:	18 టన్నులు
శానిటేషన్ కార్మికులు:	170
ట్రాక్టర్లు:	7
ఆటోలు:	14
డంపర్:	01

జనగామ: స్వచ్ఛతలో సౌత్ ఇండియాలో అవార్డు తీసుకున్న జనగామ గ్రేడ్–2 పురపాలిక కంపు కొడుతుంది. అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీలకు తోడు.. నిండిన సిల్ట్‌తో ముక్కులు దద్దరిల్లే పరిస్థితి నెలకొంది. వ్యాపారులు ఉదయం నుంచి రాత్రి ఇంటికి వెళ్లే సమయం వరకు మురికి కాల్వ నుంచి వచ్చే కంపు భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీలపై అదనపు వ్యాపారాలు, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు, టీ కప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లు పేరుకుపోవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. శానిటేషన్ నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో నిర్వహణ అధ్వానంగా మారిపోయింది. జనగామ మున్సిపల్ పరిపాలన గాడి తప్పుతోంది. గతంలో పని చేసిన కమిషనర్ ఏసీబీకి చిక్కడం... అనారోగ్యం పేరిట పట్టణ ప్రణాళిక అధికారి (టీపీఓ) పత్తా లేకపోవడంతో పురపాలికకు పెద్ద దిక్కులేకుండా పోయింది. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రమౌళి సైతం రామగుండం బదిలీ కావడంతో.. గ్రామ పంచాయతీ పాలన కంటే అధ్వానంగా మారిందని చెప్పుకోవచ్చు. అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు మినహాయిస్తే.. ప్రజా అవసరాలకు సంబంధించి ఏ ఒక్క పని కూడా జరగడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. సిద్దిపేట, హైదరాబాద్, సూర్యాపేట, హనుమకొండ ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీల్లో సిల్ట్ నిండి పోయి, మురికి నీరంతా ఒకేచోట నిలిచి పోతుంది.

వార్డుల పరిస్థితి మరీదారుణం!

జనగామ మున్సిపల్‌లో 30 వార్డులు... ప్రస్తుత జనాభా 80 వేల వరకు ఉంటుంది. సుమారు 22 కిలో మీటర్ల పరిధిలో ఉన్న పట్టణంలో 20 వేల కుటుంబాల వరకు ఉంటారు. రోజు వారీగా 15 నుంచి 18 టన్నుల చెత్త సేకరణ చేస్తారు. ఇందుకు సంబంధించి రోజువారి శానిటేషన్ నిర్వహణ కోసం సుమారు 170 మందికి పైగా శానిటేషన్ కార్మికులు పని చేస్తుండగా, 7 ట్రాక్టర్లు, 8 ఆటోలు, మరో 6 ప్రైవేటు ఆటోలు, ఒక డంపర్‌ను వినియోగిస్తున్నారు. శానిటేషన్ నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వందశాతం ఫలితం కనిపించడం లేదు. బాలాజీనగర్, కుర్మవాడ, వీవర్స్‌కాలనీ, అంబేడ్కర్ నగర్, ధర్మకంచ, హన్మకొండరోడ్డు, బస్టాండు చిన్నగేటు ఏరియా, జ్యోతినగర్, శ్రీసాయి రెసిడెన్సి ఇలా అనేక వార్డుల్లో ఎక్కడి చెత్త అక్కడే అన్నచందంగా మారిపోయింది. శానిటేషన్‌పై ప్రతి కౌన్సిల్ సమావేశంలో సభ్యులు గళమెత్తినా, సమస్య అక్కడి వరకే పరిమితమై పోతుంది.

సమస్య ఎవరికి చెప్పుకోవాలి..



దుకాణం ఎదుట డ్రెయినేజీ కూల్చి వేసి 8 ఏళ్లు గడిచి పోతుంది. రెండు వైపులా మట్టి కూరుకుపోతూ అధ్వానంగా మారింది. కస్టమర్లు షాపుకు వచ్చే పరిస్థితి లేదు. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మురికినీరు అక్కడే నిలిచి పోయి, కంపు భరించ లేకపోతున్నాం.

-ఎన్.కృష్ణ, వ్యాపారి, హెడ్‌పోస్టాఫీస్, జనగామ

అధికారుల పర్యవేక్షణ లేదు



శానిటేషన్ నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లేదు. డ్రెయినేజీలు కంపుకొడు తుంటే, వార్డుల్లో చెత్త డంపింగ్‌లు పేరుకుపోతున్నాయి. పట్టణంలో ప్రధాన సమస్యగా శానిటేషన్ మారింది. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

- గాదెపాక రాంచందర్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్

నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం..



పట్టణంలో శానిటేషన్ నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. రోజు వారీగా చెత్త సేకరణ, మురికి కాల్వల నిర్వహణపై ఫోకస్ సారిస్తున్నాం. కార్మికులు డ్రెయినేజీలను శుభ్రం చేస్తుండగా, నాలాలను జేసీబీల సహాయంతో శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే స్పందిస్తాం.

- చంద్రమౌళి, ఇన్‌చార్జ్ కమిషనర్

సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: ఈ నెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలు అధికారుల సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డీసీపీ సీతారాంతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ భావం ఉట్టిపడేలా జిల్లా వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య పనులతో పాటు వివిధ శాఖలతో స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, అతిథులకు ఆహ్వానాలు అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. అలాగే 25న జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలు, మానవ హారాలు, ఓటు హక్కు ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ టి. వేణుమాధవ్, ఏఓ రవీందర్, సీపీఓ ఇస్మాయిల్, డీఈఓ రాము, ఆర్టీసీ డీఎం జ్యోత్స్న, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి, బీసీ వెల్ఫేర్ అధికారి, రవీందర్, ఉద్యానవన శాఖ కేఆర్ లత, జిల్లా సంక్షేమాధికారి జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్‌పై అవగాహన ఉండాలి

ఈఎస్ఎంఎస్‌పై అధికారులకు అవగాహన ఉండాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులకు ఈఎస్ఎంఎస్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసీసీ నోడల్ అధికారులు, ఐటీ, ఎక్సైంజ్, కమర్షియల్ టాక్స్, అధికారులు, బ్యాంకర్లు, ఎస్ఎఎస్టీలు, ఎఫ్ఎస్టీలు తప్పనిసరిగా ఈఎస్ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్‌తో నకిలీ సమాచారం తొలగించవచ్చని, తక్షణం సమాచారం కావాలంటే అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే జనగామ రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్‌లతో పరిపాలన అంశాలు, రివిజన్ ఓటు నమోదు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై సమావేశం నిర్వహించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 4,727 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును కలిగి ఉన్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

నూతన కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: జనగామ పట్టణంలోని 30 వార్డుల్లో కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిటీల ఏర్పాటు సమయంలో సామాజిక సమతుల్యత పాటించి, అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు. రాబోయే పార్లమెంటు, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్, నాయకులు చెంచారపు బుచ్చిరెడ్డి, బడికే ఇందిరా కృష్ణస్వామి, బనుక శివరాజ్ యాదవ్, మేడ శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, ఆలేటి సిద్దిరాములు, జక్కుల అనిత వేణుమాధవ్, చెంచరాపు కరుణాకర్ రెడ్డి, నర్సింగరావు, రంగు రవి, అజహరొద్దీన్, పిట్టల సతీష్, జాయ మల్లేష్, మోర్తల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



గురుకులంలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

కొడకండ్ల: పట్టుదలతో చదివి భవిష్యత్ లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి వసతులను పరిశీలించి, విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. పాఠశాలలో భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో సౌకర్యాల కల్పనకు తప్పక కృషి చేస్తానని, విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు నసీరుద్దీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, భిక్షపతి, రమేష్, సోమనర్సయ్య, యాకేష్‌యాదవ్, వంశీకృష్ణ, శ్రీవర్ధ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానన్నారు. సమావేశంలో ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, వైస్ ఎంపీపీ వీరసోములు, తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి పాల్గొన్నారు.

అన్ని రంగాలను అభివృద్ధి చేస్తాం..

పాలకుర్తి: ప్రజలు అన్ని రంగాలను అభివృద్ధి చెందడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం పాలకుర్తి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నల్లా నాగిరెడ్డి అధ్యక్షతన జరుగగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకొని పథకాలు అమలుకు ప్రయత్నం జరుగుతుందన్నా రు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. అనంతరం జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, ఎంపీటీసీలు మాటూరి యాకయ్య, తాళ్ల సోమనారాయణ, సర్పంచ్‌లు వీరమనేని యాకాంతరావు, బుర్క కుమార్‌లు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ అశోక్‌కుమార్ కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుతున్నందున పెండింగ్ బిల్లులు, తదితర సమస్యలు పరిష్కరించాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరమనేని యాకాంతరావు కోరారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



మాట్లాడుతున్న తిరుమల్‌రావు

దేవరుప్పుల: విద్యుత్‌శాఖ పరమైన అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతామని విద్యుత్ వినియోగదారుల ఫోరం (టీఎస్ఎన్‌డీపీసీఎల్)–1 చైర్‌పర్సన్ కె. తిరుమల్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని సింగరాజుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో దేవరుప్పుల, లింగాలఘనపురం మండలాల విద్యుత్ వినియోగదారుల కోసం విద్యుత్ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా మొబైల్ నుంచి వాట్సాప్, ఆన్‌లైన్, ఈ–మెయిల్ ద్వారా సమస్యలను విద్యుత్ అధికారులకు పంపిస్తే ఆ సమస్యలను రిజిస్టర్ చేసి వెంటనే పరిష్కరిస్తామన్నారు. మొబైల్ లేని వారు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించినా సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, లోఓల్టేజీల హెచ్చుతగ్గుల మార్పు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరీ, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు, కేటగిరీ మార్పు, రద్దు వంటి సమస్యలపై 13 ఫిర్యాదులు అందగా మూడు సత్వరమే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ మెంబర్ చంద్రదాస్, టెక్నికల్ మెంబర్ నరేందర్, ఏడీఈ అనిల్, సీఏస్ వేణు, ఏఈలు సుధాకర్, రాజవర్ధన్, శంకరయ్య పాల్గొన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న స్థపతి వల్లీనాయగం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయాన్ని మంగళవారం దేవాదాయధర్మాదాయ శాఖ స్థపతి వల్లీనాయగం సందర్శించారు. ఆయనను ముందుగా ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఈ దుర్గాప్రసాద్, వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావు, డీఈఈ రమేష్‌బాబు, ఏఈఈ చందర్‌రావు, వీరస్వామి ఉన్నారు.

ఏటా లోటు.. ఎందుకీ లేటు

- గడువు పొడిగిస్తున్నా లక్ష్యానికి దూరంగానే సీఎంఆర్
- అధికారులు, రైస్‌మిల్లర్ల దొంగాట..
- పర్యవేక్షణ లేక పక్కదారి.. ఏటేటా జాప్యం
- సర్కారుకు చేరని కస్టం మిల్లింగ్ రైస్..
- వ్యాపారుల వద్దే రూ.కోట్ల విలువ చేసే బియ్యం
- 2022–23 వానాకాలం, యాసంగి టార్గెట్లు చేరని మిల్లర్లు
- పెండింగ్ బియ్యంపై కదలని పౌరసరఫరాల శాఖ



అధికారుల ఉదాసీనత.. సర్కారుకు చేరని బియ్యం..

సాక్షిప్రతినిధి, వరంగల్: రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్)కింద ఎఫ్‌సీఐకి ఇవ్వాలి. కానీ.. మిల్లర్లు ఒక సీజన్ వాయిదా వేస్తూ మరో సీజన్‌లో ఇస్తున్నారు. వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని పూర్తిగా రా రైస్‌గానే మరాడిస్తారు. ఈ కాలంలో పండిన ధాన్యం నాణ్యతతోపాటు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉంటుంది. ఒప్పందానికి విరుద్ధంగా బియ్యాన్ని కొందరు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. మరికొందరు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ వీటినే సీఎంఆర్‌గా చూపుతున్నారు. దీనికి నిదర్శనం తరచూ రేషన్ బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడుతుండటమే. అధికారుల తనిఖీల్లో మిల్లుల్లోనూ క్వింటాళ్ల కొద్ది నిల్వలు గుర్తించిన సంఘటనలున్నాయి. అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం అక్రమార్కులకు కలిసివస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022–23 వానాకాలం చెందిన రా రైస్ 49,769 మెట్రిక్ టన్నులు ఇప్పటికీ ప్రభుత్వానికి అప్పగించలేదు. అదే సీజన్ యాసంగి కస్టమ్ మిల్లింగ్ రైసు ఇవ్వడంలోనూ ఇదే పరిస్థితి.

పౌరసరఫరాలశాఖ అధికారులు ఉదాసీనత కారణంగా జేబులు దండిగా నిండిన కొందరు రైసు మిల్లర్లు రియల్ ఎస్టేట్ చేస్తూ.. ఎకరాలకు ఎకరాలు కొంటుంటే.. బ్యాంకులనుంచి అప్పులు తెచ్చి.. రైతులవద్ద ధాన్యం కొని అప్పగించి.. మధ్యలో వడ్డీలు కడుతూ పౌర సరఫరాల సంస్థ దివాలా తీస్తోంది. ఇచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే మిల్లర్లు గుటుక్కుమనిపిస్తుంటే.. సంస్థ మాత్రం బయటపడలేని స్థాయిలో అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ఉమ్మడి వరంగల్‌కు సంబంధించి 2022–23 వానాకాలంలో రైతుల నుంచి సేకరించిన 7,96,785 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ రైసు మిల్లర్లకు సీఎంఆర్ కింద ఇచ్చింది. ఇందుకుగాను 5,33,998 మె.టన్నుల మరాడించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా చెల్లించాలని సూచించింది. ఈ ఏడాది వానాకాలం సీజన్ దాటినా.. ఇంకా 49,769 మె.టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి చేరలేదు. అదే విధంగా 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి 7,09,386 మె.టన్నుల ధాన్యంపై 4,78,906 మె.టన్నుల బియ్యం సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉండగా 1,38,254 మె.టన్నులు మాత్రమే ఇచ్చారు. 2018–19 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రావాల్సిన సీఎంఆర్‌పైన కూడా అధికారులు తీసుకున్న చర్యలు లేకపోగా.. సర్కారు వడ్లతో కొందరు మిల్లర్లు యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారు.

ఆర్ఆర్ యాక్టు పెట్టే అవకాశం ఉన్నా.. నోటీసులతో సరి...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతేడాది రెండు సీజన్లకు చెందిన సీఎంఆర్ సేకరణ నెమ్మదిగా సాగుతోంది. జిల్లావ్యాప్తంగా బాయిల్డ్, రా రైస్ మిల్లులు 326 వరకు ఉన్నాయి. వీటిలో బాయిల్డ్ మిల్లులకు అన్నింటికీ సార్టెక్స్ యంత్రాలున్నాయి. వీటి ద్వారా ఎఫ్‌సీఐకి కేటాయించే బియ్యానికి దాదాపు అభ్యంతరాలు ఉండవు. కానీ రా రైస్ మిల్లులకు 70శాతం ఈ అదనపు పరికరాలు ఏర్పాటు చేసుకోలేదు. దీంతో ఎఫ్‌సీఐ నాణ్యతగా లేవంటూ తిప్పి పంపిస్తోంది. వీటినే రాష్ట్రానికి కేటాయించే రేషన్ బియ్యంగా వాడుతున్నారు. దీనికి తోడు ఉమ్మడి జిల్లాలోని కొన్ని మిల్లులు కూటమిగా మారి రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా కొనసాగిస్తున్నాయి. దీంతో ఆయా మిల్లర్లు వానాకాలం సీజన్‌లోని నాణ్యమైన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఫిర్యాదులతో తనిఖీలకు వెళ్లిన అధికారులకు అక్కడి నిల్వలను కాగితాల్లో పరిశీలించడమే తప్ప, వాటిని లెక్కించే పరిస్థితి ఉండదు. ఫిర్యాదుల ఒత్తిడి పెరిగితే నోటీసులతో సరిపెడుతూ 'మామూలు'గా తీసుకుంటున్నారు. గడువుతీరిన, ఏళ్ల తరబడిగా కస్టమ్ మిల్లింగ్ బియ్యం ఇవ్వని రైసుమిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్టు (ఆర్ఆర్ యాక్టు) పెట్టే అవకాశం ఉన్నా నోటీసులతో సరిపెడుతూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కూటమిగా మారిన మిల్లర్లు అధికారుల కళ్లుగప్పి తమ దందా సాగిస్తున్నారు.

జిల్లాల వారీగా సీఎంఆర్ లక్ష్యం, సేకరణ ఇలా..(మె.టన్నులలో..)

జిల్లా	మొత్తం ధాన్యం	ఇవ్వాల్సిన బియ్యం	ఇచ్చిన బియ్యం	ఇవ్వాల్సిన బియ్యం
వానాకాలం - 2022-2023				
హనుమకొండ	1,34,271	90,134	84,879	5,255
వరంగల్	1,79,931	1,20,798	1,08,236	12,562
భూపాలపల్లి	84,215	55,376	51,355	4,021
మహబూబాబాద్	1,56,737	1,05,514	83,424	22,090
జనగామ	1,11,932	75,183	70,594	4,589
ములుగు	1,29,699	86,993	85,741	1,252
యాసంగి - 2022-2023				
హనుమకొండ	1,40,813	94,979	33,780	61,199
వరంగల్	1,53,904	1,03,882	24,564	79,318
భూపాలపల్లి	109647	74,031	16,095	57,936
మహబూబాబాద్	96,665	65416	15,599	49,817
జనగామ	1,43,351	96,743	36,964	59,779
ములుగు	65,006	43,855	1,1252	32,603

అధిక సాంద్రత పత్తి సాగు లాభదాయకం

- జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్

రఘునాథపల్లి: అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగొండ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, యాదాద్రి ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధిక సాంద్రత పత్తి సాగుతో గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గడంతో పాటు పెట్టుబడి తగ్గి అదనపు ఆదాయం వస్తుండటంతో రైతులు మొగ్గు చూపాలన్నారు. పంటల సాగులో అధిక దిగుబడుల కోసం రైతులు నూతన సాంకేతిక పద్ధతులు రైతులకు చేర వేయడంలో శాస్త్రవేత్తలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. యాదాద్రి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ బి.అనిల్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వీరన్న, డాక్టర్ ఓం ప్రకాష్‌లు మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా డీఈఓ. టెక్నికల్ ఏఈఓలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, ఏఈఓ సుస్మిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న జీపీ కార్మికుడి మృతి


మహేందర్(ఫైల్)

దుగ్గొండి: భార్యను చితక బాదిన అనంతరం అత్తింటి వారు మందలిస్తారని భయపడిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గిర్ని బావిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సింగారపు మహేందర్(35) కొన్ని సంవత్సరాలుగా గ్రామ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మహేందర్ భార్య రమ ఈనెల 18న మొక్కులు సమర్పించడానికి వేములవాడకు వెళ్లింది. తిరిగి 19న రాత్రి ఇంటికి రావడంతో మహేందర్ ఆమెతో గొడవ పడ్డాడు. రమను చితకబాదడంతో ఆమె చేయి విరిగింది. దీంతో విషయం తన అత్తింటి వారికి తెలిసి వారు వచ్చి తనను మందలిస్తారని భయపడి అదే రోజు అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

- ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి
- గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ శరత్


జంపన్నవాగు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెక్రటరీ శరత్, డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేశాఖ సెక్రటరీ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం మేడారంలోని సమ్మక్క (ఆదివాసీ) భవనంలో సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి జాతర ఏర్పాట్లపై ఆయశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారానికి భక్తులు అధికంగా తరలివస్తున్నారని, ప్రస్తుతం పూర్తయిన పనులను వారికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, పార్కింగ్ స్థలాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు, టాయిలెట్ తదితర అన్ని వసతులు చేపట్టాలన్నారు. భక్తుల సౌకర్యాల కల్పనలో రాజీ పడొద్దని, ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సివిల్ పనులు మరో ఏడు రోజుల్లో పూర్తి కానున్నట్లు తెలిపారు. జంపన్నవాగులో లోతు ప్రాంతాలు గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక లెవలింగ్ సక్రమంగా చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. బారికేడింగ్ ఏర్పాటులో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. అధికారులు టీమ్ వర్క్‌తో పనిచేసి జాతరను జయప్రదం చేయాలన్నారు. అనంతరం జాతరలో చేపడుతన్న ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంతకు ముందు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో ఎస్పీ శబరిష్, పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణు గోపాల్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ అశోక్ కుమార్, ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, ఆలయ ఈఓ రాజేంద్రం, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.9 లక్షల విలువైన ఆస్తి అగ్నికి ఆహుతి
- వెంక్యాతండాలో ఘటన


దగ్ధమైన గృహోపకరణాలు, నగదు, వెండి ఆభరణాలు

కేసముద్రం: షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో రూ.9 లక్షల విలువైన బంగారం, వెండి, నగదుతోపాటు, గృహోపకరణాలు, బియ్యం దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండలంలోని ధర్మారంతండా జీపీ శివారు వెంక్యాతండాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం సాయంత్రం తండాలో అన్నదానం ఏర్పాటు చేయగా, ఇదే తండాకు చెందిన కున్సోత్ బాబు తన ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి అక్కడికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నిప్పురవ్వలు వస్తువులపై పడి మంటలు వ్యాపించాయి. ఇంటి నుంచి పొగలు వస్తుండడంతో తండావాసులు అక్కడికి చేరుకున్న మంటలు ఆర్పేప్రయత్నం చేశారు. కాని అప్పటికే రూ.2 లక్షల నగదు , 2 తులాల బంగారం, 40 తులాల వెండి, కంప్యూటర్, జిరాక్స్ ప్రింటర్, 10వ తరగతి మెమో, ఇతర సర్టిఫికెట్లు, 3 క్వింటాళ్ల బియ్యం, దుస్తువులు, గృహోపకరణ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మొత్తం సుమారు రూ.9 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఆర్ఐ బాబు, కార్యదర్శి ముఖేష్ మంగళవారం ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

గంజాయితో వెళ్తున్న కారు బోల్తా


బోల్తాపడిన కారు ఇదే..

నెల్లికుదురు : గంజాయితో వెళ్తున్న కారును ఎక్సైజ్ పోలీసులు వెంబడిస్తుండగా పారిపోయే క్రమంలో బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని బంజర బస్ స్టేజీ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కారులో గంజాయితో మహబూబాబాద్ నుంచి నెల్లికుదురు వైపునకు వస్తున్నారు. దీనిపై సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు సదరు వాహనాన్ని వెంబడిస్తున్నారు. విషయం తెలిసిన గంజాయి వాహనదారులు పారిపోయే క్రమంలో వేగంగా వస్తూ మండలంలోని బంజర బస్ స్టేజీ సమీపం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారి వైపు అదే వేగంతో మళ్లించడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కారు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని తొర్రూరు వైపునకు తీసుకెళ్లారు. ఈ విషయమై పోలీసులను సమాచారం అడగగా ధ్రువీకరించలేదు.

కేయూలో క్రాస్‌కంట్రీ పోటీలు

- చాంపియన్‌షిప్ సాధించిన కేడీసీ విద్యార్థులు..


చాంపియన్‌షిప్ సాధించిన జట్టుకు కప్ అందజేస్తున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్‌బోర్డు ఆధ్వర్యంలో 2023–2024 విద్యాసంవత్సరానికి సంబంధించి మంగళవారం ఇంటర్ కాలేజియేట్ క్రాస్‌కంట్రీ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి చాంపియన్ షిప్ సాధించారు. ఖమ్మం యూనివర్సిటీ వ్యాయామ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. మహిళా విభాగంలో కాకతీయ యూనివర్సిటీ మహిళా వ్యాయామ కళాశాల విజేతగా నిలిచి చాంపియన్ షిప్ సాధించింది. ఉట్నూరు కళాశాల(టీటీడబ్ల్యూ ఆర్‌డీసీ మహిళా) ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుమందు వీసీ తాటికొండ రమేష్ ఈ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ శ్రీనివాస్‌రావు, పి భాస్కర్, ఏటీబీటీ ప్రసాద్, సావిత్రి, జేత్యా, జె ఉపేందర్, బి రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జ్ రాంచంద్రారావు


మాట్లాడుతున్న రాంచంద్రారావు

గీసుకొండ: బీఆర్ఎస్ సర్కారు అవినీతిపై సీబీఐ విచారణ చేయాలని, మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని బీజేపీ వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచంద్రారావు అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకులతో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాధికులు బీజేపీ వైపే ఉన్నారన్నాని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటర్లను నమోదు చేయించి గెలుపొందేలా శ్రేణులు కృషి చేయాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి శ్రీరామ మందిర దర్శన్ అభియాన్ పేరుతో బీజేపీ ప్రభుత్వం అయోధ్య రామమందిరాన్ని దర్శించడాని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసిందన్నారు. 40 సంవత్సరాల లోపు ఉన్న ఒక్కొక్కరికి రూ. 1665 టికెట్ ఉంటుందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ మేయర్ టి. రాజేశ్వర్‌రావు, మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, మొలుగూరి భిక్షపతి, ఎం. ధర్మారావు, వరంగల్ పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, దశమంతరెడ్డి, ఒద్దిరాజు రాంచంద్రారావు, బలరాం, కన్న యుగేందర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, గట్టికొప్పుల రాంబాబు, క్రాంతికుమార్, గోదాసి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కేయూకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి


మాట్లాడుతున్న మూర్తి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం కేయూలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్సరాల నుంచి ఉన్నత విద్యను అభివృద్ధి చేయడంలో విఫలమైందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యారంగం పరిస్థితి దీనస్థితికి దిగజారిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత విద్యను, యూనివర్సిటీలను గాలికి వదిలేశాయని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానంలో అనేక లోపాలున్నాయన్నారు. అందుకే ఈ విద్యావిధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, యూనివర్సిటీ సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు జస్వంత్, ప్రదీప్, కార్తీక్, అఖిల్ కుమార్, ప్రణయ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

- యువకుడికి తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం
- నాగారం సమీపంలో ఘటన

హసన్‌పర్తి: బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం అంబాల, హనుమకొండ మార్గమధ్యలోని నాగారం సమీపంలో జరిగింది. హనుమకొండ జిల్లా నడికూడ మండలం మర్రిపల్లి గూడెం–వెంకటేశ్వరపల్లికి చెందిన బూర రాజ్‌కుమార్(35) నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలోని నాగారం సమీపంలో చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

'మల్బరీ'లో పశు ఎరువు వాడాలి

- సైంటిస్టు వినోద్‌కుమార్


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఎల్కతుర్తి: మల్బరీ తోటలో రసాయణ ఎరువులకు బదులు పశువు ఎరువు వినియోగించాలని సైంటిస్టు వినోద్‌కుమార్ యాదవ్ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని పట్టుపరిశ్రమ కార్యాలయంలో నిర్వహిస్తున్న 3 రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం కొనసాగిన రెండో రోజు కార్యక్రమంలో వినోద్‌కుమార్ యాదవ్ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. రెండు ఎకరాల మల్బరీ తోటలో 12 టన్నుల పశువుల ఎరువు వేయాలన్నారు. తద్వారా ఆకు పచ్చదనం నిండుకుని నాణ్యతగా లభిస్తుందన్నారు. దీంతో పట్టుపురుగుల పెంపకంలో నాణ్యమైన పట్టుగూళ్లు రావడంతో పాటు అధిక దిగుబడి పెరుగుతుందని తెలిపారు. మల్బరీ సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త గడ్డిపల్లి, సైంటిస్టు రాఘవేంద్ర, ఏడీఎస్ వరంగల్ డాక్టర్ దయాకర్‌రావు, ఎం సారంగపాణి, డాక్టర్ దినేష్‌కుమార్ తివారి, పట్టుపరిశ్రమ శాఖ అధికారి సీహెచ్ నవీన్‌పాల్‌రెడ్డి, కె.సంజీవరెడ్డి, ఏఎస్ఓ అరవింద్, రాజయ్య, ఎండీ షోయాబ్‌ఖాన్, టీవో దేవరాజ్, టీఏ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా పట్టురైతులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని ఆందోళన


కల్తీ పెట్రోల్‌ను ఫొటో తీస్తున్న బాధితుడు

కాజీపేట: కాజీపేట డీజిల్ కాలనీలోని ఓ బంక్‌లో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ద్విచక్ర వాహనదారులు మంగళవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. బాపూజీనగర్‌కు చెందిన ధార నాగరాజు ఓ బాటిల్‌లో హాఫ్ లీటర్ పెట్రోల్ పోయించుకోగా నీళ్లను పోలినట్లు వచ్చింది. దీంతో అనుమానం వచ్చి వెంటనే మరో బాటిల్‌లో పెట్రోల్ పోయించగా రంగు మరో తీరు కనిపించింది. దీంతో పెట్రోల్ కల్తీ జరిగిందని ఆరోపిస్తూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై బీజేపీ నాయకులు మహేందర్, వెంకట్రావు కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.



ట్రాక్టర్ అపహరించిన వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

దోర్నకల్: స్థానిక బైపాస్‌లోని పెట్రోల్ బంక్ వద్ద నిలిపిన ట్రాక్టర్‌ను అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం దోర్నకల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన ఇండియన్ పెట్రోల్ బంక్ ఆవరణలో నిలిపిన ట్రాక్టర్ అపహరణకు గురికాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సై సంతోష్‌రావు మంగళవారం సిబ్బందితో కలిసి గొల్లచర్ల సమీపంలో వాహన తనిఖీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గుర్రాలకుంట జీపీలోని ధాన్యా తండాకు చెందిన నూనావత్ శివ అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాక్టర్ అపహరించినట్లు ఒప్పుకున్నాడు. ట్రాక్టర్‌ను అపహరించిన శివ.. దానిని ఓ కార్వీలో పార్క్ చేశాడు. సోమవారం విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌రావు, కానిస్టేబుళ్లు సైదులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జనగామ రూరల్: సిద్దిపేటలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ మండలంలోని పెద్దపహాడ్ గ్రామానికి చెందిన ఎండీ మునీర్ (30) మృతి చెందాడు. మునీర్ దంపతులు కొంత కాలంగా సిద్దిపేటలో బంగారం పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉండగా సమీపంలోని ఓ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో పిల్లలకు భోజనం తీసుకెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో మునీర్ మృతి చెందాడు.

యాంటీ బయోటిక్‌పై అవగాహన ఉండాలి

- డాక్టర్ మహేందర్
- మామునూరు కేవీకేలో రైతులకు శిక్షణ


మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

కరీమాబాద్: యాంటీ బయోటిక్ మందుల వినియోగంపై రైతులకు అవగాహన ఉండాలని తెలంగాణ రాష్ట్ర పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ మహేందర్ అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత, పరిష్కారాలు' అనే అంశంపై నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు యాంటీ బయోటిక్ మందులు విచక్షణరహితంగా వినియోగించడం వల్ల ప్రజారోగ్య సమస్యగా మారిందన్నారు. పాడి పశువులకు అవసరం లేకున్నా ఈ మందులు వేయడం వల్ల యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ ఏర్పడడమే కాకుండా ఆ పాలు తాగిన మనుషులు కూడా కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ప్రతీ విషయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజన్న మాట్లాడుతూ తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంతోపాటు హైదరాబాద్‌కు చెందిన సద్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ ఒప్పందం ప్రకారంగా జిల్లాలోని రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించడమే కాకుండా సందేహాలుంటే వారిని అడిగి నివృత్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సద్గురు మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీదివ్య, జెనెక్స్ రీజినల్ మేనేజర్ హరీష్‌రావు, కేవీకే శాస్త్రవేత్తలు శశాంక్, సాయికిరణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

గొడ్డలితో చెల్లిపై అన్న దాడి..

- ఆస్తి తగాదాల నేపథ్యంలో ఘాతుకం
- లక్ష్మీదేవిపేటలో ఘటన


ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): ఆస్తి తగాదాలతో చెల్లిపై అన్నయ్య గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీదేవిపేటలో జరిగింది. వెంకటాపురం ఎస్సై రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నం రాధమ్మ, శ్రీహరి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. పెద్ద కుమార్తె వివాహం అనంతరం శ్రీహరి మృతిచెందాడు. దీంతో దివ్యాంగులైన అక్కాచెల్లెల్లు సమ్మక్క, సారక్క.. తల్లి రాధమ్మతో కలిసి ఉంటున్నారు. ఇద్దరు కూతుళ్లకు తండ్రి శ్రీహరి మూడు ఎకరాల భూమి ఇవ్వగా, అందులో ఎకరం భూమిని ఇటీవల కూతుళ్లు అమ్మకానికి పెట్టి బయానా తీసుకున్నారు. దీంతో సోదరుడు సమ్మయ్య.. భూమి అమ్మొద్దని, చెల్లెళ్లతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సారక్కతో భూమి విషయమై సమ్మయ్య, అతడి భార్య ఇందిర గొడవపెట్టుకున్నారు. ఆగ్రహానికి గురైన సమ్మయ్య.. సారక్కపై గొడ్డలితో దాడికి పాల్పడగా తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై రాజు ఘటనా స్థలికి చేరుకుని సారక్కను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం సమ్మయ్య, ఇందిరను అదుపులోకి తీసుకుని గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

'ప్లాస్టిక్'లో దగ్గు మందు ప్రాణాంతకం

- సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్



మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్ : ప్లాస్టిక్ బాటిళ్లలోని దగ్గు మందు ప్రాణాంతకమని, దీని నిషేధం కోసం న్యూఢిల్లీలోని డైరెక్టర్ జనరల్, రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఏబీసీ డబ్ల్యూసీ నేషనల్ మెంబర్ మెగిలిచెర్ల సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో మురహరి కార్తీక్ అధ్యక్షతన నాసిరకం ఔషధాలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు దేశాలు బ్యాన్ చేసిన ప్లాస్టిక్, పీఈటీ బాటిళ్లలో నింపిన దగ్గు మందు (కాఫ్ సిరప్)ను పిల్లల తాగించడం వల్ల మరణాలు సంభవించాయన్నారు. పలు కంపెనీలు ప్లాస్టిక్ బాటిళ్లలో దగ్గు మందు నింపి సరఫరా చేస్తున్నాయని, దీనిని వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు దగ్గు మందు వినియోగంపై జాగ్రత్తలు పాటించి పిల్లల ఆరోగ్యం కాపాడాలని కోరారు. అనంతరం ప్రభుత్వ వైద్యుడు మోహన్‌రావు మాట్లాడారు. వివిధ వ్యాధుల నిర్మూలనకు వినియోగించే మందులపై వైద్యులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, దంత వైద్యులు చంద్రకాంత్, మీర్ శాకీర్, రవీందర్, పరమేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారిణులతో వ్యవసాయశాఖ ఏడీ బలరాం తదితరులు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 20, 21వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో హనుమకొండ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. హనుమకొండ విద్యార్థిని బండారి సాన్వీమోహన్ 36 కేజీల పాయింట్ ఫైట్ విభాగంలో బంగారం, లైయిట్ కాంటాక్ట్ ఫైట్ విభాగంలో వెండి పథకాలు సాధించినట్లు హనుమకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండారి సంతోష్ తెలిపారు.

అగ్రికల్చర్ విద్యార్థినుల సత్తా..

వరంగల్ అగ్రికల్చర్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు పాల్గొనగా సీనియర్ విభాగంలో కరాటే కట్టాస్ పాయింట్ ఫైట్, లైట్‌ఫైట్, కిక్‌లైట్, ఫైటింగ్ విభాగాలలో పాల్గొని ఎం భార్గవి 60 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, పీపీ శ్రీజ 65 కేజీల కేటగిరీలో గోల్డ్, బ్రాంజ్, బి శ్వేత 45కేజీల గోల్డ్, బ్రాంజ్ మెడల్, బి అఖిల 55కేజీల గోల్డ్, సిల్వర్ మెడల్స్, మాధవి 40 కేజీల విభాగంలో సిల్వర్, జి ప్రియాంక, కె శ్యామల, ఎన్ హరిప్రియ కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ సిరిగిరి తిరుపతి తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను వ్యవసాయ కళాశాల ఏడీ బలరాం, ఓఎస్డీ సంతోష్, వెంకట్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల బ్రిడ్జి వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఏఎస్సై అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామ శివారులోని గోవింద్ తండాకు చెందిన మేఘవత్ శంకర్ గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం లభించాయి. దీంతో బియ్యంతోపాటు వాహనం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కాగా, శంకర్.. వాహనంలో పాలకుర్తి మండలం గూడూరు నుంచి పటాన్ చెరు ప్రాంతంలోని కోళ్ల ఫామ్‌లకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని ఎస్సై పేర్కొన్నారు.